RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం
మన దేశం..మన హక్కు
తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక :102 ఆదివారం 18-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

## తెలంగాణలో విస్తరించిన ఆవర్తనం

### ఉత్తరాంధ్రలో వర్షాలకు అవకాశం

అమరావతి,ఆగస్ట్17: ఐఎండీ సూచనల ప్రకారం ఉత్తర కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ ప్రాంతంలో ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.సోమవారం.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ



### ఆర్థిక అంశాలపైనే ప్రధానంగా చర్చ
### పోలవరం, రాజధానికి నిధులపై ప్రస్తావన
### రుణపరిమితి పెంచాలని విన్నవించినట్లు సమాచారం
### పలువురు కేంద్రమంత్రులతోనూ చర్చలు

న్యూఢిల్లీ,ఆగస్ట్17 : ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించినట్టు సమాచారం. ముఖ్యంగా రుణాలు రీ షెడ్యూల్ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నిధుల విడుదలపైనా చంద్రబాబు వాకబు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేయాలని ప్రధానమంత్రి మోదీని చంద్రబాబు కోరినట్లుగా తెలుస్తోంది. ప్రధానితో ఆయన సుదీర్ఘంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా రాష్ట్రానికి రుణ పరిమితి పెంచడంతో పాటు రాజధానికి ఇప్పిస్తామన్న పదిహేను వేల కోట్ల నిధుల గురించి.. ఇతర గ్రాంట్ల గురించి చర్చించినట్లుగా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో చేసిన అప్పులను రీషెడ్యూల్ చేయాలని ఏపీ ప్రభుత్వం ఇటీవలి కాలంలో ప్రధానంగా కోరుతోంది. ఈ అంశంపైనా ప్రధాని మోదీకి నివేదిక ఇచ్చినట్లుగా చెబుతున్నారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ ఆర్థిక పరిస్థితి అత్యంత ఘోరంగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టుకోవాలంటే కేంద్ర సాయం అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు పెట్టింది. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోంది . బీజేపీకి పూర్తి మెజార్టీ లేకపోవడంతో టీడీపీ మద్దతు కీలకం. అందుకే టీడీపీ కీలక ప్రయోజనాలను సాధించుకుంటోందన్న అభిప్రాయం జాతీయ రాజకీయాల్లో ఉంది. చంద్రబాబు పర్యటనలో రాజకీయ చర్చలు కూడా చోటు చేసుకున్నాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇటీవలి కాలంలో బయటపడుతున్న స్కాములు.. జగన్ పాలనలో చేసిన దోపిడీ గురించి పూర్తి స్థాయిలో ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా చెబుతున్నారు. లిక్కర్ స్కామ్‌లో సీఐడీ దర్యాప్తుతో పాటు వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగినందున ఈడీ విచారణకు సిఫారసు చేస్తామని స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విషయాన్ని మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లుగా చెబుతున్నారు. అలాగే బయటపడిన అనేక స్కాముల విషయంలో.. తీసుకోవాల్సిన చర్యల విషయంలోనూ.. కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం అవసరమని అడిగినట్లుగా భావిస్తున్నారు. మరో వైపు జాతీయ రాజకీయాలపైనా చర్చించినట్లుగా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల రాజకీయంలో ఇటీవల కీలక మార్పులు వస్తున్నాయి. కొన్ని పార్టీల విలీనం.. మరికొన్ని పార్టీల పొత్తుల వ్యవహారాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. అలాగే రాజ్యసభలో ఉపఎన్నికల తర్వాత ఎన్డీఏ మెజార్టీ సాధించనుంది. ఆ క్రమంలో ఎన్డీఏ అనుసరించాల్సిన వ్యూహంపైనా ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు నాయు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను శనివారం సాయంత్రం కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన చంద్రబాబు మోదీని సన్మానించి రాష్ట్రంలో చేపట్టిన పనుల పురోగతిని, అందుకు కేంద్రం నుంచి కావాల్సిన సహాయాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రధానికి వినతి పత్రం అందజేశారు.

# స్వర్ణభారతి ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి

### వెంకయ్య సేవలను కొనియాడిన ధనఖడ్



నెల్లూరు,ఆగస్ట్17 : ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నెల్లూరులో పర్యటించారు. శనివారం ఉదయం అక్షర విద్యాలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఘనస్వాగతం పలికారు. స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవ సభలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ..సంక్షేమ కార్యక్రమాల కోసం వెంకయ్యనాయుడు జీవితం అంకితం చేశారు. గ్రామీణ భారతంలో సేవకు ఆయన అంకితమయ్యారు. సమరయోధుల కలలు నేడు సాకారమవుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఐజీ రాజీవ్ కుమార్ మీనా, డిఐజీ షిమోషి బాజ్ పారు, ఎస్.పి సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా.శిరీష తదితర అధికారులు ప్రజాప్రతినిధులు భారత ఉప రాష్ట్రపతి దంపతులకు స్వాగతం పలికినవారిలోఉన్నారు. అనంతరం భారత ఉప రాష్ట్రపతి నెల్లూరు జిల్లాలోని అక్షర విద్యాలయ క్యాంపస్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం స్వర్ణ భారత ట్రస్ట్ 23 వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## తుంగభద్ర డ్యామ్ 19వ గేటు స్థానంలో విజయవంతంగా స్టాప్ లాగ్ పనులు పూర్తి

కర్నూలు : తుంగభద్ర డ్యామ్‌లో గల్లంతైన 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. పనులు చేపట్టిన 24 గంటలలోపే 5 బ్లాక్‌ల్లో స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అధికారులు విజయవంతంగా అమర్చారు. 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అమర్చి వృథాగా పోతున్న నీటిని పూర్తిగా అడ్డుకున్నారు.తుంగభద్ర బోర్డు కర్ణాటక ఆంధ్రప్రదేశ్ అధికారులు ఉమ్మడి కృషి ఫలితంగా డ్యామ్‌లోని నీటిని వృథాగా వెళ్లకుండా అడ్డుకున్నారు. డ్యాంల గేట్లు తయారీలో నైపుణ్యం ఉన్న సాగునీటి నిపుణులు కన్నయ్య నాయుడు ఈ బృందానికి నాయకత్వం వహించారు.తుంగభద్ర నుంచి గత నాలుగు రోజులుగా 45 టీఎంసీల నీరు కిందకు వృథాగా వెళ్లింది. మరింత నీరు దిగువకు పోకుండా యుద్ధప్రాతిపదికన రెండు ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవడంలో సఫలమయ్యారు. స్టాప్‌లాగ్ నిర్మాణ ఖర్చుల కోసం రూ. 5 కోట్ల నిధుల వినియోగానికి తుంగభద్ర పాలకమండలి అనుమతి ఇచ్చిందని అధికారులు తెలిపారు.



## సివిల్ అధికారుల పేరుతో డ్రామాలు

### గతంలో అధికారులను వేధించన ఘనత జగన్‌దే
### తెదేపా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శలు
### వైకాపాలో పరాకాష్టకు మద్యం అక్రమాలు: జివి

గుంటూరు,ఆగస్ట్17: సివిల్ సర్వీస్ అధికారుల పేరిట వైకాపా, జగన్ డ్రామాలు ఆడుతున్నారని తెదేపా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అణచివేసిందే జగన్ అని మండిపడ్డారు. నాటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం విషయంలో ఏం చేశారో గుర్తులేదా? అని ప్రశ్నించారు. వైకాపా హయాంలో సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీవీ ఐదేళ్లు పోస్టింగ్ కోసం పోరాడారని గుర్తుచేశారు. సివిల్స్ అధికారుల సర్వీస్ రిజిస్టర్లు జగన్ వద్దే పెట్టుకుని వేధించారని ఆరోపించారు. ఎంపీని లాకప్‌లో హింసించిన అధికారులపై చర్యలు తీసుకోకూడదా? అని ప్రశ్నించారు. వైకాపా హయాంలో చేసిన తప్పులపై వారే సిగ్గుతో తల దించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం తమ ప్రభుత్వ నిర్ణయమని ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఇదిలావుంటే మద్యం అక్రమాలకు జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని తెదేపా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. కల్తీ, నాసిరకం మద్యంతో 30 వేల మందికిపైగా ప్రాణాలు తీశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మద్యం విధానాన్ని సంస్కరించాలని చూస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్లలో రూ.1.24 లక్షల కోట్ల మద్యాన్ని నగదు రూపంలో అమ్మారన్నారు. డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల గొంతులో విషం పోశారని మండిపడ్డారు. జగన్, విజయసాయిరెడ్డి, వాసుదేవరెడ్డి, మిథున్‌రెడ్డి పాపాలు అన్నీఇన్నీ కావని పేర్కొన్నారు. ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ కుంభకోణాలు చిన్నబోయేలా వైకాపా హయాంలో మద్యం అక్రమాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నికలలో వైసీపీ కాళ్లు, కీళ్లు విరగ్గొట్టి మూల కూర్చోబెట్టినా జగన్‌లో ఇంకా బుద్ధి రాలేదంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ రాక్షస మద్యం విధానం సంస్కరించాలని చూస్తుంటే తప్పుడు ప్రచారామా అంటూ విరుచుకుపడ్డారు. జగన్ కల్తీ, నాసిరకం మద్యంతో 30 వేల మందికి పైగా ప్రజల ప్రాణాలు తీశారన్నారు. అయిదేళ్లలో రూ.1.24లక్షల కోట్ల మద్యాన్ని జగన్ నగదు రూపంలోనే అమ్మారన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల గొంతుల్లో విషం పోశారని మండిపడ్డారు.జగన్, విజయసాయిరెడ్డి, వాసుదేవరెడ్డి, మిథున్‌రెడ్డి పాపాలు అన్నీఇన్నీ కావన్నారు. ఢిల్లీ, ఛత్తీస్‌గడ్ కుంభకోణాలు చిన్నబోయేలా వైసీపీ హయంలో మద్యం అక్రమాలు జరిగాయన్నారు. మద్యం విధానంలో మార్పులతో కూసాలు కదులుతాయానే జే-గ్యాంగ్‌లో కలకలం చెలరేగుతోందన్నారు. చిప్పకూడు తినడం అర్థమై కావాలని కూటమి ప్రభుత్వంపై సాక్షిలో తప్పుడు కథనాలు రాస్తున్నారంటూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

### విధులు బహిష్కరించి నిరసనలు..ధర్నాలు
### కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే హాజరు

న్యూఢిల్లీ,ఆగస్ట్17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా కాకరేపుతోంది. కోల్‌కతాలో జరిగిన ఘటనపై దేశంలో వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చారు. గతంలో ఏవైనా ఘటనలు జరిగేటప్పుడు స్వరాష్ట్రంలో మాత్రమే నిరసనలు జరిగేవి. తీవ్రత ఆధారంగా దేశ వ్యాప్తంగా నిరసన గళం వినిపించేది. ప్రస్తుతం కోల్‌కతా ఘటనపై ప్రతి ఒక్కరూ న్యాయం కోసం నినదిస్తున్నారు. దేశంలో వైద్యులంతా ఐక్యమై రోడ్డెక్కారు. ముందు తమ ప్రాణాలకు రక్షణ కల్పిస్తే.. తాము రోగుల ప్రాణాలు కాపాడతామంటూ వైద్యులు నినదిస్తున్నారు. మరోవైపు పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఓవైపు సీబీఐ విచారణ కొనసాగుతుండగా.. త్వరగా విచారణ పూర్తిచేసి..నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం నిరసనల్లో పాల్గొన్నారు. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పశ్చిమబెంగాల్ బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు ఈ ఘటనలో నిందితులందరిని తక్షణమే అరెస్ట్ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో ఆసుపత్రిలోని కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనపై తెలుగు రాష్ట్రాల్లో వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశశ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా శనివారం 24 గంటలపాటు వైద్య సేవల బంద్ చేయాలని నిర్ణయించాయి వైద్య సంఘాలు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆరోగ్య సేవలు, సాధారణ సేవలు శస్త్రచికిత్సలు శనివారంఉదయం 6 నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. డాక్టర్లు కేవలం ఎమర్జెన్సీ కేసులను మాత్రమే అటెండ్ అవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడించింది. ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు కొనసాగుతు న్నాయి. ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఈ సమ్మెకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, మెడికల్ సిబ్బంది సైతం తమ సంఘీభావం ప్రకటించి ఓపీ సేవలను నిలిపివేశారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తికి డెడ్‌లైన్ ఫిక్స్.. ఏపీవాసులకు కేంద్రం గుడ్‌న్యూస్..

అమరావతి,ఆగస్ట్17 :సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్, ఏపీ సీఎం చంద్రబాబు భేటి అయ్యారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టులు, సీ ప్లేన్స్ పాలసీపై చర్చించారు. 2026 జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తామన్నారు మంత్రి రామ్మోహన్‌నాయుడు.అటు ఏపీలో మిగతా ఎయిర్‌పోర్టుల విస్తరణ కూడా వచ్చే ఏడాదిలోగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈస్ట్ కోస్ట్‌లో లాజిస్టిక్ హబ్‌గా మారబోతుందని.. వాటికి అనుసంధానంగానే కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం జరుగుతుందన్నారు మంత్రి. 30 ఏళ్ల తర్వాత అవసరాల దృష్టిలో పెట్టుకుని కొత్త పోర్టులకు శ్రీకారం చుట్టామన్నారు. రిమోట్ ప్రాంతాల్లో కూడా 80, 20 సీటర్స్ విమానాలు తిప్పేలా ఎయిర్ పోర్టులకు రూపకల్పన చేయాలని చంద్రబాబు సూచనలకు అనుగుణంగా అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు.ఏపీలో సీ ప్లేన్స్ ప్రాజెక్టు మళ్లీ రెక్కలు తొడుగుతోంది. వారంరోజుల్లో కేంద్రం సీ ప్లేన్ పాలసీ తీసుకొస్తుందని ఇందులో భాగంగా ఏపీలో ఉన్న అవకాశాలపై ప్రత్యేకంగా దృష్టిపెడతామన్నారు మంత్రి రామ్మోహన్‌నాయుడు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

### అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మంత్రి గొట్టిపాటి

అమరావతి,ఆగస్ట్17: ప్రమాదాల నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ షాక్‌తో చనిపోయిన వారి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రాణ నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధిక ప్రాణ నష్టం ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. తర్వాత చేయబోయే సమీక్షనాటికి సంబంధిత సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాధితులందరి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖతో నష్టపోయిన ప్రతీ కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.'రాష్ట్రంలో కరెంట్ షాక్ ఘటనలు చాలా జరుగుతున్నాయి. అధికారులంతా ఈ అంశంపై దృష్టిసారించాలి. నిత్యం నివేదికలు సిద్ధం చేసుకోవాలి. విద్యుత్ లైన్ల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చనిపోయిన వారికి ఎంతో కొంత నష్టపరిహారం ఇవ్వడం మా ప్రభుత్వ విధానం కాదు. బాధిత కుటుంబాలందరినీ అన్ని రకాలుగా ఆదుకుంటాం' అని రవి కుమార్ అన్నారు.

## ఆకట్టుకుంటున్న కాటూరి ఆర్ట్ గ్యాలరీ.. ప్రభుత్వం మద్దతిచ్చేలా మంత్రి నాదెండ్ల భరోసా

అమరావతి,ఆగస్ట్17 :కళలకు కాణాచి తెనాలి.. ఎందరో సినీ కళామబిడ్డల పుట్టని ఊరు తెనాలి.. ఎందరో ప్రఖ్యాతి శిల్పులు ఇక్కడ నుండే వచ్చారు. అటువంటి తెనాలిలో ఇప్పుడు ఆర్ట్ గ్యాలరీ ఆకట్టుకుంటుంది.చరిత్రలో భాగస్వాములైన రాజులు, స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడి అసువులు బాసిన సమర యోధులు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేసిన శాస్త్రజ్ఞులు, రాజకీయ నాయకులు వీటితో పాటు మోడ్రన్ ఆర్ట్‌లో భాగమైన స్క్రాప్‌తో తయారు చేసిన విగ్రహాలు ఇవన్నీ ఒకే చోట ఉంటే ఏ విధంగా ఉంటాయో ఆలోచించండి. ఇప్పుడు కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఇవన్నీ ఒకే చోట కొలువుదీరి ఉన్నాయి.గత ముప్పై ఏళ్లుగా విగ్రహాల తయారీలో ఉన్న సూర్య శిల్పశాల శిల్పులు తయారు చేసిన విగ్రహాలతో ఈ ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. సంప్రదాయ పల్లె అందాలను అద్భుతంగా తన శిల్పాల్లో తీర్చిదిద్దారు.ఒకవైపు ధాన్యం బస్తాలతో వెలుతున్న రైతు బండి, మరొకవైపు బండ లాగుడు పందెంకు కాలు దువ్వుతున్న ఎద్దులు ఇవే కాకుండా చెయిన్ లింక్‌లతో తయారు చేసిన బాహుబలి ఎద్దు.. ఇలా అనేక విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నారు.ఆటో మొబైల్ ఇండ్రస్ట్రీలో వినియోగించే నట్టులు, బోల్టులు, చెయిన్స్ తయారు చేసిన గాంధీ విగ్రహం, సారనాద్ మూడు సింహా లో స్థూపం, ఆర్మీ జవాన్, స్కూటర్, జీపు ఎంత అందంగా ఉన్నాయో చెప్పటం కంటే చూడటమే బెటర్ అంటున్నారు రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్.

# సంపాదకీయం

ఆదివారం 18-08-2024

## ఇక భారత్ లో యుసీసీ....

యుసిసి అన్ని వర్గాలకు మేలు మాత్రమే కాకుండా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ అయిన 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు అనుగుణంగా ఉంటుందని.. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ఆలోచనాతీరుతో నడుస్తుందని బీజేపీ వర్గాలు చెబుతూ వస్తున్నాయి. అయితే, యూసీసీలోని ప్రతిపాదనల్లో బహుభార్యత్వం, బాల్య వివాహాలపై పూర్తి నిషేధం, అన్ని మతాలలోని బాలికలకు ప్రామాణికమైన వివాహ వయస్సు, విడాకుల కోసం ఎవ్వరికైనా ఒకే ప్రక్రియ ఉన్నాయనీ.. లింగ సమానత్వం, సామాజిక ఐక్యతను పెంపొందించే లక్ష్యంతోనే ఈ చట్టాన్ని తీసుకువస్తున్నట్లు ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. ఈ యూసీసీ ముసాయిదా పౌర జీవితంలోని వివిధ కోణాలకు ఆపాదించబడుతుంది. వారసత్వ హక్కులు, తప్పనిసరి వివాహ నమోదు, బాలికలకు పెరిగిన వివాహ వయస్సు, వివాహానికి ముందు వారి విద్యాభ్యాసాన్ని సులభతరం చేయడం వంటి సిఫార్సులు ఉన్నాయి. అదనంగా, తమ వివాహాలను నమోదు చేసుకోని జంటలు ప్రభుత్వ సౌకర్యాలకు అనర్హులవుతారు. కనుక ఇది చట్టపరమైన డాక్యుమెంటేషన్‌ను తప్పనిసరి చేసే చట్టంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అయితే, ఈ ప్రతిపాదిత యూసీసీ చట్టం.. ముస్లిం మహిళలతో సహా ప్రతి ఒక్కరికీ దత్తత హక్కులను మంజూరు చేస్తోందని అంటున్నారు. అయితే, ఇది హలాలా, ఇద్దత్ వంటి.. విడాకులు తీసుకున్నా? భర్త మరణించిన తర్వాత స్త్రీ తప్పనిసరిగా పాటించాల్సిన ఇస్లామిక్ పద్ధతులను తొలగిస్తోంది. అలాగే, లివ్-ఇన్ రిలేషన్స్ డిక్లరేషన్‌లో ఉన్న సహజీవనాన్ని ప్రోత్సహించడం, సులభమైన దత్తత ప్రక్రియల వంటి పద్ధతులను నిషేధిస్తుంది. ప్రతిపాదిత యూసీసీ అమల్లోకి వచ్చిన తర్వాత, ఇద్దరి మధ్య సహజీవనం అనేది చట్టం ప్రకారం నమోదు చేయాల్సి ఉంటుంది. అలాంటి సంబంధాలను నమోదు చేసుకోవడం వల్ల పురుషులు, మహిళలు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. దీనితో, మహిళలు నమోదు చేసే తప్పుడు కేసులు కూడా తగ్గుతాయనీ.. అలాంటి కేసుల్లో ఇప్పుడు చట్టపరమైన పవిత్రత ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇక యూసీసీ ఇతర ముఖ్య లక్షణాలను గమనిస్తే.. కుమారులు, కుమార్తెలకు సమాన ఆస్తి హక్కులు, చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన పిల్లల మధ్య వ్యత్యాసాలను తొలగించడం.. దత్తత తీసుకున్న, బయోలాజికల్‌గా జన్మించిన పిల్లలకు సమాన హక్కులను అందిస్తుంది. ఒక వ్యక్తి మరణించిన సందర్భంలో, ప్రతిపాదిత జఅఅ ప్రకారం, జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులకు సమానమైన ఆస్తి హక్కులు అందుతాయి. అటువంటి హక్కులను పరిమితం చేసిన గత చట్టాలు దీనితో రద్దుచేయబడతాయి. అయితే, ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్న ముసాయిదాలో జనాభా నియంత్రణ చర్యలతో పాటు, ఉత్తరాఖండ్ జనాభాలో 3 శాతం ఉన్న షెడ్యూల్డ్ తెగలను మినహాయించారు. దీని ప్రకారం, ఇతర రాష్ట్రాల్లో కూడా యూసీసీని తీసుకువస్తే షెడ్యుల్ తెగలను మినహాయించి, ఇతర హిందూయేతర కమ్యూనిటీలకు వర్తించే విధంగా.. అంటే, ముఖ్యంగా.. అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ముస్లీంలకు వర్తించే విధంగా దీన్ని అమలు చేయాల్సి ఉంటుంది. జఅఅని అమలు చేసిన మొదటి భారతీయ రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించినప్పటికీ, ఇంకొన్ని రాష్ట్రాలు కూడా దీనిని అమలు చేయాలనే ఉద్దేశాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. కర్నాటకలో 2023 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ పార్టీ యూసీసీ అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రాలేదు. ఇక, గతేడాది ఫిబ్రవరి 2024 నాటికి అస్సాంలో యూసీసీని అమలు చేస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ చెప్పారు. ట్రిపుల్ తలాక్ గురించి శర్మ మాట్లాడుతూ, "ఎవరూ ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండటానికి అనుమతించబడరు. మన ముస్లిం మహిళల గొప్ప ప్రయోజనాల కోసం యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలి" అని అన్నారు. అలాగే, జూన్ 2023లో, ప్రధాని మోడీ మహారాష్ట్రలో యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. దీనిపై ఆ రాష్ట్రం తొమ్మిది మంది సభ్యుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇక, 2022లో, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కూడా యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. అయితే, ఇంతవరకూ ఉత్తరాఖండ్ మినహా ఇతర రాష్ట్రాలు ఏవీ ప్రతిపాదనను ముందుకు కొనసాగించలేదు. అయితే, ఈ సమస్యకు మూలాలు బ్రిటీష్ వలస పాలనలోనే మొదలయ్యాయి. దీనికి హిందూ కోడ్ బిల్లు సాక్ష్యంగా నిలించింది ఒకవైపు పురుషాధిక్య సమాజం, మరోవైపు మత విశ్వాసాల మధ్య జీవిస్తున్న సమాజంలో చట్టం అమలు.. దాని లక్ష్యానికి తగ్గట్లు వ్యక్తులను, ముఖ్యంగా స్త్రీలకు రక్షణ కల్పించడం కష్టసాధ్యంతో కూడుకున్న పని. అంతకుమించి, ఈ చట్టం కుటుంబ సంబంధాల్లో మరిన్ని సమస్యలు తెచ్చే పెట్టే అవకాశం ఉందనే వాదనలూ లేకపోలేదు. చట్టం చుట్టూ.. ఏకరూపత, లింగ సమానత్వం, సాంఘిక ఏకీకరణ కనిపిస్తున్నప్పటికీ.. అదే సమయంలో మత స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల గురించి ఆందోళనలను కూడా పెంచుతుంది. ఇక, భారతదేశంలో ఉన్న వ్యక్తిగత చట్టాలు, ప్రస్తుత మతపరమైన ఆచారాలు, సంప్రదాయాల ఆధారంగానే ఉన్నాయి. హిందూ వ్యక్తిగత చట్టాలనేవి పురాతన గ్రంథాలు, ఆచారాల నుండి ఉద్భవించాయి. హిందూ సమాజంలో వివాహం అనేది విడాకులు, వారసత్వం వంటి విషయాలను నియంత్రిస్తాయి. మరోవైపు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లింల వ్యక్తిగత విషయాలను పర్యవేక్షిస్తుంది. అలాగే, ఇతర మత సంఘాలు వారి స్వంత వ్యక్తిగత చట్టాలను కలిగి ఉంటాయి. అయితే, వీటన్నింటనీ నిషేధిస్తూ ఈ చట్టం రావడం వారి మనోభావాలను పూర్తిగా విస్మరించడమే అనే వాదనలు వస్తున్నాయి. యూనీఫాం సివిల్ కోడ్ అమలుకు ఉన్న సవాళ్లలో మత పెద్దలదే కీలక పాత్ర. వీరిలో కొందరు సామరస్యం, జాతీయ సమైక్యతల కోసం వాదిస్తుంటే.. మరికొందరు మత స్వేచ్ఛ, సాంస్కృతిక పద్ధతులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇవి మతాంతర వివాహాలు, సంబంధాలపై ప్రభావం చూపిస్తాయి. వివాహంలో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. విభిన్న మతపరమైన నేపథ్యాలకు చెందిన జంటలు ఎదుర్కొనే సంక్లిష్టతను తగ్గిస్తుంది. అదే సమయంలో కుల దురహంకార పరువు హత్యలను మరింత తీవ్రతరం చేసే అవకాశం కూడా ఉంటుందనే వాదనలు ఉన్నాయియూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించి వివిధ సంఘాలు భిన్నమైన అభిప్రాయాలు, ఆందోళనలను కలిగి ఉన్నాయి. కొందరు మెరుగైన సాంఘిక ఐక్యత ఉంటుందని చెబుతుంటే.. మరికొందరు సాంస్కృతిక గుర్తింపు కోల్పోవడం గురించి భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు.

# దువ్వాడ రాజకీయ సన్యాసం



శ్రీకాకుళం, ఆగస్టు 17 తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారం రేపిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం ఇంకా సద్దుమణగలేదు. వివాదంలో రాజీ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాన్నివ్వడం లేదు. మరోవైపు ఈ వ్యవహారంపై వైసీపీ అధినాయత్వం కూడా ఫోకస్ చేసినట్టు చెబుతున్నారు. ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ పంచాయితీకి ఇప్పట్లో ఎండ్ కార్డు పడేలా కనిపించడం లేదు కానీ ఆయన రాజకీయ జీవితానికి మాత్రం ఫుల్‌స్టాప్ పడేలా ఉందంటున్నాయి వైసీపీ వర్గాలు. చాలా కాలంగా జరుగుతున్న పరిణామాలు ముఖ్యంగా పది రోజుల నుంచి రగులుతున్న వివాదాలపై వైసీపీ అధినాయకత్వం చాలా కోపంగా ఉందని వార్తలు వస్తున్నాయి. దువ్వాడ శ్రీనివాస్ శ్రీనివాస్ వ్యవహారంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని జగన్ ఆలోచిస్తున్నారని టాక్ నడుస్తోంది. ఆయనపై భార్య బిడ్డలే పోరాటం చేయడం న్యాయం చేయాలంటూ రోడ్డు కెక్కడం పార్టీకి నష్టం కలిగిస్తుందని అంటున్నారని తెలుస్తోంది. వేరే స్త్రీతో కలిసి ఉంటానని భార్య బిడ్డలపై శ్రీనివాస్ చేసిన కామెంట్స్ అన్నీ పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోంది. అందుకే సరైన టైంలో దీనిపై కీలకమైన నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. విజయసాయిరెడ్డి విషయంలో పార్టీ సరిగా స్పందించలేదనే అపవాదు ఉండనే ఉంది. ఇప్పుడు దువ్వాడ వ్యవహారంలో కూడా చూసీచూడనట్టు ఉంటే కచ్చితంగా పెద్ద నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. అందుకే ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న దువ్వాడ సభ్యత్వాన్ని రద్దు చేయాలని భావిస్తున్నారని సమాచారం. అంతే కాకుండా పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేస్తారని అనుకుంటున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే కీలకమైన నేతలతో చర్చలు కూడా జరిగాయని అంటున్నారు. ఇదే జరిగితే మాత్రం దువ్వాడ రాజకీయ జీవితానికి ఎండ కార్డు పడినట్టే అంటున్నారు జిల్లా నాయకులు. కాంగ్రెస్‌తో రాజకీయ ప్రయాణం ప్రారంభించి రాజశేఖర్ రెడ్డికి చేరువై... జగన్‌కు దగ్గరై కీలకమైన నేతగా ఎదిగారు దువ్వాడ శ్రీనివాస్. జగన్‌కు అండగా ఉంటూ ఎవరైనా ఆయన్ని విమర్శిస్తే విరుచుకుపడే ఇలాంటి నేత దూరం చేసుకోవడం వైసీపీకి కష్టమే అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పదని అంటున్నారు. మూడు దశాబ్దాల పాటు ఎంతో కష్టపడి..ఎన్నో బాధలను దిగమింగుతూ.. కష్టాలను దాటుకుంటూ.. ఒక్కో ఇటుకను పేర్చి..ఇంతింతై..ఎదిగిన శ్రీనివాస్..ఒక్క వివాదంతోనే తెరమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి. ఎవరూ ఊహించని విధంగా ఆయన భవిష్యత్తు ఇలా డైలమాలో పడింది. మరోవైపు శ్రీకాకుళం జిల్లా కాళింగుల్లో కీలకంగా ఎదిగిన నేతల్లో దువ్వాడ శ్రీనివాస్ ఒకరు. మొదట్లో తమ్మినేని సీతారామ్‌కు అధిక ప్రాధాన్యత ఉండేది. తర్వాత దువ్వాడ శ్రీనివాస్‌కి కూడా అస్థాయి ఇంపార్టెన్సీ లభించింది. ఇలా కీలకంగా ఎదుగుతున్న నేత గ్రాఫ్ సడెన్‌గా పడిపోవడంతో ఆ సామాజిక వర్గంలో కూడా ఆందోళ వ్యక్తమవుతోంది. రాజకీయాల్లో కీలకమైన నేతలుగా ఎదిగే క్రమంలో ఎలాంటి తప్పులు చేయకూడదో అనేందుకు దువ్వాడ శ్రీనివాస్ ఉదంత ఒక ఉదాహరణగా చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు

## అన్నా క్యాంటీన్ల ఖర్చు రూ. 200 కోట్లు

గుంటూరు, ఆగస్టు 17 అమ్మ.. అన్న..పేరు ఏదైతేనేం.. పేదోళ్ల కడుపులు నింపడానికి? ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా? తాము పెట్టుకున్న గడువుకున్నా ముందే టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పేరుతో తీసుకొచ్చిన పథకం అన్న క్యాంటీన్లు. ఇక్కడ భోజనం చేయడానికి అర్హత అక్కర్లేదు. రేషన్ కార్డు చూపించక్కర్లేదు. కడుపులో ఆకలి, చేతిలో 5 రూపాయలు ఉంటే చాలు.. అన్న క్యాంటీన్లోకి అడుగుపెట్టొచ్చు. ఓ పెద్ద హోటల్ అందించేంత మెనూతో, అత్యంత శుభ్రతతో భోజనం వడ్డిస్తారు. నిజానికి గతంలోనే కూలీలు, కార్మికులు, డ్రైవర్లు, వీధుల్లో షాపులు నడిపించేవారు.. ఇలా ఎంతో మంది పేదల ఆకలి తీర్చింది అన్న క్యాంటిన్. జస్ట్ 5 రూపాయలకే పరిశుభ్రమైన ఆహారం దొరుకుతూ ఉండటంతో పెద్ద సంఖ్యలో పేదలు వీటిని ఉపయోగించుకున్నారు. ఆ తర్వాత ఐదేళ్లు వీటికి బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. ఉద్దేశం ఏదైనా.. రాజకీయంగా ఎవరెన్ని కామెంట్లు చేసినా.. పట్టణాల్లోని పేద, దిగువ మధ్యతరగతి వారి ఆకలిబాధ తీర్చాయి అన్న క్యాంటీన్లు. అందులో ఎలాంటి సందేహాలు లేవు.

అన్న క్యాంటీన్లలో కేవలం ప్రభుత్వ పాత్ర మాత్రమే లేదు. ఒకరకంగా అన్న క్యాంటీన్ బిల్డింగ్ కట్టించి, భోజనాలు తీసుకొచ్చే హాట్ బాక్సలను మాత్రమే ప్రభుత్వం అరేంజ్ చేస్తుంది. ఆహారం రుచికరంగా వండి సమయానికి తగ్గట్టుగా ట్రాన్స్‌పోర్ట్‌తో సహా తీసుకొచ్చేది మాత్రం హరే కృష్ణ మూమెంట్‌కు చెందిన అక్షయ పాత్ర సంస్థ. బియ్యం కొనటం, వండటం, రుచికరంగా కూరలు వండి జాగ్రత్తగా తీసుకురావడం.. ఈ బాధ్యత తీసుకుంటోంది అక్షయపాత్ర ఫౌండేషన్. పైగా అన్న క్యాంటీన్ల విషయంలో ప్రభుత్వం ఖర్చు పెట్టేది చాలా తక్కువ. రోజుకు ఒక్కో మనిషికి మూడు పూటలకు కలిపి 90 రూపాయలు ఖర్చు అవుతుండగా 15 రూపాయలు మాత్రమే పేదవారి నుంచి కట్టించుకుని.. మిగతా 75 రూపాయలను ప్రభుత్వమే చెల్లించనుంది. మూడు పూటలా కలిపి రోజూ లక్షా 5వేల మంది పేదలకు ఆహారం సరఫరా చేయనున్నారు. ఉదయం 35వేల మందికి టిఫిన్ అందిస్తారు. అంతే స్థాయిలో 35వేల మందికి మధ్యాహ్నం, 35 వేల మందికి రాత్రి సమయంలో భోజనం పెడతారు. ఒక్కో క్యాంటీన్లో సుమారు 350 మందికి సరిపడా ఆహారాన్ని మూడు పూటలా అందుబాటులో ఉంచుతారు. ఎన్ని సంక్షేమ పథకాలున్నా.. పేదల కడుపు నింపుతున్నది మాత్రం అన్నక్యాంటీనే. ప్రస్తుత లెక్కల ప్రకారం ఏడాదికి సుమారు 200 కోట్ల రూపాయలు దీనికి ఖర్చవుతుందని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే, ఈ కార్యక్రమం కోసం విరాళాలు సేకరిస్తోంది ప్రభుత్వం. స్వయంగా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. తెలుగు ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని



విజయవంతం చేసేందుకు ముందుకురావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అనవసర ఖర్చులు, ఆడంబరాలు, పెళ్లి ఖర్చులు తగ్గించుకొని అన్న క్యాంటీన్ ట్రస్టుకు విరాళాలివ్వండి. సేవ చెయ్యాలన్న ఆలోచనతో దాతలు ముందుకు రావాలి. మీరు మంచి పనికోసం 10 రూపాయలు ఖర్చు పెడితే.. మీ ఆదాయం 100 రూపాయలు పెరుగుతుంది. విరాళాలిచ్చేందుకు మరింత సౌకర్యంగా ఉండేందుకు డిజిటల్ విరాళాల స్వీకరణకు కూడా ఏర్పాట్లు చేశాం" అని చంద్రబాబు గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా దాతలకు పిలుపునిచ్చారు. ఒక్కరోజేప్రభుత్వానికి అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం సుమారు రూ.2కోట్లకు పైగా విరాళాలను దాతలు అందించారు. దీంతో ఇలా సేకరించిన విరాళాలకు అకౌంట్‌బులిటీ ఉండాలనే ఉద్దేశంతో ఎస్‌బిఐలో ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచింది ప్రభుత్వం. ఎవరైనా విరాళాలు అందించాలనుకుంటే ఆ ఖాతాకు కూడా నేరుగా పంపించవచ్చు. అన్న క్యాంటీన్ల విరాళాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యాంక్ ఖాతా వివరాలు

ఖాతా పేరు: అన్న క్యాంటీన్స్

ఖాతా నెంబర్: 37818165097

బ్రాంచి: చంద్రమౌళినగర్, గుంటూరు

ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: ాఃఎౖ0020541

రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోగా ప్రారంభించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఇప్పటికే 100 క్యాంటీన్లు మొదలయ్యాయి. సెప్టెంబర్ మొదటి వారానికల్లా మిగతా వాటిని కూడా ప్రారంభిస్తామని ఏపీ సీఎం చెప్పారు. " అన్న క్యాంటీన్లను ట్రస్టు ద్వారా శాశ్వతంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే గిరిజన ప్రాంతాల్లో మండలానికో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు.

## భారీగా పెరగనున్న రేషన్ డిపోలు

కాకినాడ, ఆగస్టు 17 ఏపీలోని కూటమి ప్రభుత్వం రేషన్ షాపులపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇప్పటికే కొత్త కార్డుల జారీపై కసరత్తు షురూ చేయగా... దుకాణాల సంఖ్యను కూడా పెంచాలని నిర్ణయించింది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కొత్తగా 4 వేల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. కొత్త రేషన్ కార్డుల జారీకి ఆంధ్రప్రదేశ్ లో రంగం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన డిజైన్లను పౌరసరఫరాల శాఖ పరిశీలించే పనిలో పడింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. ముందుగా కొత్తగా పెళ్లైన వారికి త్వరితగతిన కార్డులను పంపిణీ చేస్తారని సమాచారం. ఇదిలా ఉంటే? రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పంపిణీ కేంద్రాలను పెంచాలని సర్కార్ నిర్ణయించింది. రేషన్ పంపిణీ మరింత సజావుగా సాగడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 29 వేలకుపైగా రేషన్ దుకాణాలు ఉండగా?. కొత్తగా మరో 4 వేల కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. నిర్దేశిత సమయంలో లబ్ధిదారుడికి రేషన్ అందించటమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎక్కువ రేషన్ కార్డులు ఏ పరిధిలో ఉంటే అక్కడ ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనిపై పౌరసరఫరాల నుంచి ప్రకటన వస్తుంది. ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాల్లో కొన్నింటికి ఇన్‌ఛార్జ్ డీలర్లు ఉన్నారు. అయితే ఇలాంటి పరిస్థితులు ఎక్కడైతే ఉన్నాయో? వాటిని గుర్తించాలని సర్కార్ నిర్ణయించింది. త్వరితగతిన ఆయా ఖాళీలను కూడా భర్తీ చేసే చర్యలను ప్రారంభించనుంది. ప్రాథమిక వివరాల ప్రకారం? 6 వేలకుపైగా డీలర్ల ఖాళీలు ఉన్నట్లు గుర్తించారుకొత్త రేషన్ కార్డుల డిజైన్లను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ? త్వరలోనే తుది డిజైన్ ను ఖరారు చేయనుంది. ఆ వెంటనే కార్డుల జారీ కోసం ప్రకటన వెలువడనుంది. అయితే ఇకపై రేషన్ కార్డు తీసుకోవాలనుకునే కొత్త జంట.. తప్పనిసరిగా మ్యారేజీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఇటీవలే ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా రేషన్ కార్డుల జారీపై కీలక ప్రకటన చేశారు. కొత్త కార్డులను డిజైన్ చేసే పనిలోనే ఉన్నామని చెప్పారు. కొత్తగా వివాహమైన జంటలు కొత్త రేషన్ కార్డు కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని?. ఇలాంటి సమస్యలను పరిష్కరించే దిశగా నిర్ణయం తీసుకోబోతున్నామని నాదెండ్ల తెలిపారు. వివాహం చేసుకొని రేషన్ కార్డులో పేర్లు లేనివారిని గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఓ కార్యక్రమాన్ని చేపడుతామనిపేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులను తప్పకుండా జారీ చేస్తామని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ముందుగా ఎవరైతే వివాహం చేసుకుని పేర్లు నమోదు చేసుకోలేదో వారిని గుర్తిస్తామని మంత్రి నాదెండ్ల క్లారిటీ ఇచ్చారు. మొత్తంగా చూస్తే త్వరలోనే ఏపీలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పట్టాలెక్కే అవకాశం ఉంది.

## శ్రీశైలం తెలుగు యూనివర్శిటీ సమీపంలో చిరుత పులి సంచారం

శ్రీశైలం,నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రంలోని తెలుగు యూనివర్సిటీ వద్ద గల ప్రహారీ గోడపై చిరుత పులి సంచరించడం స్థానికంగా కలవరపెడుతుంది. ఈరోజు సాయంత్రం 6 గంటల సమయంలో రుద్రపార్కు సమీపంలోని ప్రహరీ గోడపై చిరుతపులి నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న కొందరు చిరుతపులి సంచారాన్ని వారి సెల్ ఫోన్ లో వీడియో దృశ్యాలను చిత్రీకరించారు సాయంత్రం సమయంలోనే చిరుతపులి జన సంచారంలోకి రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తరచూ పలుమార్లు ఇదే పరిసర ప్రాంతాల్లోనే చిరుత పులి సంచారాన్ని తాము చూసామంటూ స్థానికులు చెబుతున్నారు అయితే ఈవిషయంపై అటవీశాఖ అధికారులు,దేవస్థానం అధికారులు చిరుత పులి తిరుగుతున్న ప్రదేశాల్లో రాత్రి సమయాల్లో స్థానికులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. మరోపక్క అటవీ ప్రాంతం దగ్గరలోనే ఉండడంతో చిరుత పులులు పలుమార్లు సంచరించడం పరిపాటిగా మారింది...

## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

తిరుమల,తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి కృష్ణన్ పాల్ గుర్జార్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పంకజ్ మిథాల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, తెలంగాణ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ లు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో ప్రముఖులకు వేదపండితులు వేదాశీర్వచనం అందించగా?. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

# విచారణలను ప్రభావితం చేస్తున్న పోలీస్ బాస్ లు

విజయవాడ, ఆగస్టు 17 వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే ఆరోపణలతో పోస్టింగ్ దక్కక వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులకు మెమోలు జారీ చేయడం వెనుక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతున్న పలు అంశాలపై దర్యాప్తును ప్రభావితం చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే ఆరోపణలతో పోస్టింగ్‌లకు దూరమైన ఐపీఎస్ అధికారులపై డీజీపీ చర్యలు చేపట్టారు. పోస్టింగ్ లేకపోవడంతో ఆఫీసుకు రాకుండా కాలక్షేపం చేస్తున్న ఐపీఎస్‌లపై బుధవారం కొరడా ఝుళిపించారు. హెడ్ క్వార్టర్లు విడిచి వెళ్లకూడదనే ఆదేశాలను పాటించకుండా పలువురు ఐపీఎస్‌లు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో చర్యలు చేపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న అధికారులు రోజూ ఉదయం పదికల్లా ఆఫీసుకు రావాలని ఆదేవించారు. పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లో ఉన్నా ఐపీఎస్‌లు ఇకపై రోజూ డీజీపీ ఆఫీసులో హాజరు కావాలని ఆదేశిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పత్తా లేకుండా పోయిన డీజీ స్థాయి నుంచి పలు హోదాల్లో ఉన్న ఐపీఎస్‌లు ఈ జాబితాలో ఉన్నారు. మొత్తం 16మంది పేర్లతో కూడిన జాబితాతో డీజీపీ మెమో జారీ చేశారు. వీరంతా ఇకపై డీజీపీ కార్యాలయంలో రోజూ అటెండెన్స్ నమోదు చేయాల్సి ఉంటుంది. పోస్టింగ్ లేకపోవడంతో విధులకు హాజరు కాని ఐపీఎస్‌లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వీరిలో డీజీ స్థాయి అధికారులు పీవీ సునీల్ కుమార్, పిఎస్సార్ ఆంజనేయులు సహా 16మంది ఐపీఎస్‌లు ఇకపై రోజూ డీజీపీ ఆఫీసుకు రావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆఫీసర్స్ వెయిటింగ్ హాల్లో ఉన్న అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని మెమోలో పేర్కొన్నారు. ఉదయం పది నుంచి అందుబాటులో ఉండాలని విధులు ముగించుకుని వెళ్లే సమయంలో సమయం నమోదు చేయాలని అత్యవసర విధుల కేటాయింపుకు డీజీపీకి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

### కేసులను నీరుగార్చేలా యత్నాలు

వెయిటింగ్‌లో ఉన్న వారిలో డీజీ క్యాడర్‌లో ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్సార్ ఆంజనేయులు, మాజీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్, అదనపు డీజీ సిఐడి మాజీ చీఫ్ ఎన్.సంజయ్, విజయవాడ మాజీ సీపీ తాతా కాంతిరాణా, ఐజీ పాలరాజు, సీఐడీ ఐజీ కొల్లి రఘురామిరెడ్డి, డిఐజి అమ్మిరెడ్డి, సిహెచ్ విజయరావు, విశాల్ గున్నీ, ఎస్పీ క్యాడర్‌లో ఉన్న అన్బురాజన్, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణకాంత్ పాటిల్‌సంజయ్, కొల్లి రఘురామరెడ్డి, సంజయ్ ఉన్నారు. డీజీ స్థాయి ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇవ్వకపోవడం సాధారణమే అయినా, వారు రోజూ కార్యాలయాలకు వచ్చి అటెండెన్స్ నమోదు చేయాలని ఆదేశించడం వెనుక అసలు కారణాలు వెలుగు చూశాయి. వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ లకు మెమో జారీ వెనుక ఇంటెలిజెన్స్ నివేదికలు కారణంగా తెలుస్తోంది. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాలు, ఏపీ ఫైబర్ నెట్ సహా పలు అంశాలపై విచారణకు ఆదేశించింది. వీటిలో కొన్ని కేసుల్ని ఏపీసీఐడీకి అప్పగించింది. ఈ పరిణామాలపై ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించింది. అయితే ప్రభుత్వం విచారణకు ఆదేశించిన కేసులను నీరుగార్చేలా వెయిటింగులో ఉన్న కొందరు ఐపీఎస్ అధికారులు కుట్రలు చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ప్రస్తుతం పోస్టింగ్ లేకుండా ఉన్న అధికారుల్లో.. గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన పలువురు సీనియర్ అధికారులు ఉన్నారు. వీరంతా రకరకాల స్థాయిల్లో పలు కేసుల్ని నీరు గార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేసుల్ని దర్యాప్తు చేస్తున్న అధికారులను, పోలీస్ సిబ్బందిని వెయిటింగులో ఉన్న ఐపీఎస్ లు తమ వద్దకు పిలిపించుకుని మాట్లాడుతున్నారని ప్రభుత్వానికి సమాచారం అందింది. దర్యాప్తు బృందాలను విచారణ సరిగా చేయొద్దని తూతూ మంత్రంగా విచారణ ముగించాలంటూ వెయిటింగ్ లో ఉన్న కొందరు ఐపీఎస్ లు ప్రభావితం చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. కొన్ని కేసుల్లో తమ పేర్లతో పాటు వైసీపీ పెద్దల పాత్రను ప్రమేయాన్ని తక్కువ చేసి చూపేలా కేసులను దర్యాప్తు చేయాలని ఐపీఎస్ అధికారులు సూచించడంపై ఆధారాలతో సహా నివేదికలను ప్రభుత్వానికి అందించారు. వివిధ కేసుల్లో జరుగుతున్న అంతర్గత విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేసినట్టు ప్రభుత్వం గుర్తించడంతో శాఖపరమైన చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేసినట్టు తెలుస్తోందవెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారుల తీరుతో కంగుతిన్న ప్రభుత్వ పెద్దలు, వైసీపీకి అనుకూలంగా ఇప్పటికీ పని చేస్తున్న వారిని గుర్తించాలని పోలీసు బాధ్యులకు సూచించినట్టు సమాచారం. పలు కేసుల దర్యాప్తులో అటంకం కల్పించే ప్రయత్నాలపై చర్యలు తీసుకోడానికి సిద్ధం అవుతోంది. ఈ పరిణామాలతో అప్రమత్తమైన డీజీపీ కార్యాలయం, వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ అధికారులను రోజు వచ్చి హెడ్ క్వార్టర్స్ లో సంతకాలు చేసి వెళ్ళాలని ఆదేశాలు జారీ చేసింది. భారతీయ న్యాయ సంహితలో కేసు విచారణను ప్రభావితం చేయడం కూడా నేరంగా పరిగణిస్తున్న నేపథ్యంలో చట్టపరమైన చర్యలకు ఉన్న అవకాశాలు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

## ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం లో మెరుగైన మౌలిక వసతులు కల్పించండి

### వైద్యాధికారి కళ్యాణ్ కు ఏఐవైఎఫ్ నాయకుల వినతి

దేవనకొండ ఆగస్టు 17,మండల కేంద్రమైన దేవనకొండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి సి. రమేష్, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం. రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) దేవనకొండ మండల సమితి ఆధ్వర్యంలో వైద్యాధికారి కళ్యాణ్ కు ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల నుండి వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన కనీస వసతులు కల్పించడంలో మండల స్థాయి అధికారులు విఫలం చెందారని వారు ఆరోపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రోగులకు చాలీచాలని బెడ్లు ఉన్నాయన్నారు. ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తే నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రెగ్యులర్ గా లేకపోవడం వలన దూరప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు కేరాఫ్ అడ్రస్ గా దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి స్థానంలో ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మహిళలు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటూ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కావున మండల కేంద్రమైన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు తీసుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు కొనసాగే విధంగా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మండల నాయకులు భాస్కర్, వీరాంజనేయులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టండి

### -హిందూ ఐక్యవేదిక మంథని పట్టణ బందు పిలుపు విజయవంతం

మంథని,బంగ్లాదేశ్ లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని మంథని హిందూ ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా శనివారం మంథని పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బందు విజయవంతమైంది. పట్టణంలోని వ్యాపార సంస్థలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు సంపూర్ణంగా బందుకు సహకరించాయి. బంధు పిలుపు నేపథ్యంలో ఎవరికి వారే స్వచ్ఛందంగా బంద్ పాటించి నిరసనలు తెలియజేశారు. హిందూ ఐక్యవేదిక నాయకులు స్థానిక అయ్యప్ప దేవాలయం నుండి ద్విచక్ర వాహనాల ద్వారా మంథని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. తమ పిలుపుమేరకు ఈ బంద్ విజయవంతం చేసిన సందర్భంలో ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఎక్కడైనా హిందువులకు ఆపద వాటిల్లితే స్పందించేందుకు మంథని హిందు ఐక్య వేదిక సిద్ధంగా ఉంటుందన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నా పర్వాలేదని హిందూ ఐక్యవేదికలోకి వచ్చేవరకు మనమంతా హిందువులమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంథని పట్టణంలో గణేష్ నవరాత్రులకు ముందు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతి ఒక్కరు ఆ సమావేశానికి హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. మంథని పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు కొత్త శ్రీనివాస్, మెడగొని రాజమౌళి గౌడ్, కనుకుంట్ల స్వామి, గర్రెపల్లి వెంకన్న, సబ్బని సంతోష్, రాపర్తి సంతోష్, తూర్పాటి రాము, మాడిశెట్టి సురేందర్, ఎం నరేందర్ రెడ్డి, బొడ్డు సతీష్, బొడ్డు వెంకటేష్, సామల అశోక్, బత్తుల సత్యనారాయణ లతో పాటు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులకోసం భారీగా దరఖాస్తులు

అమరావతి,ప్రభుత్వ శాఖల్లో నామినేటెడ్ పదవుల కోసం టిడిపి కార్యాలయానికి భారీగా దరఖాస్తులు చేరుకున్నాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవుల కోసం నేతలు తమ దరఖాస్తులను పార్టీ కార్యాలయంలో అందజేశారు పార్టీలో తాము చాలా కష్టపడ్డామని, ఆర్థికంగా నష్టపోయామని, తమపై కేసులు కూడా ఉన్నాయని దరఖాస్తుల్లో చూపుతున్నారు. వీటితోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులు, సీనియర్ నేతల సిఫార్సుల లేఖలను కూడా జత చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఇప్పటి వరకు సుమారు 23 వేల దరఖాస్తులు పార్టీ కార్యాలయానికి వచ్చాయి. భారీగా దరఖాస్తులు రావడంతో వీటిని వడపోసే కార్యక్రమం టిడిపి చేపట్టింది. అందరికీ ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై తీవ్ర కసరత్తు చేస్తోంది. దీని కోసం పది మందితో ఒక కమిటీని పార్టీ అధిష్టానం ఏర్పాటు చేసింది. ప్రోగ్రామ్స్ కమిటీ నుంచి వచ్చిన దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వద్దకు తీసుకెళు _న్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ వడపోత తరువాత ఎవరికి ఏ పదవులు దక్కుతాయో స్పష్టత ఉంటుందని అంటున్నారు.సీట్లు కోల్పోయిన వారికే తొలి ప్రాధాన్యత టిడిపి-బిజెపి జనసేన పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన నేతలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా 31 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. వీరితోపాటు ఇతరుల కోసం సీట్లు త్యాగం చేసిన వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఆ తరువాత పార్టీకి ఆర్థికంగా విరాళాలు అందించిన వారిని కూడా పరిశీలించాలని చూస్తోంది. సెప్టెంబరులోపు పూర్తి చేయాలనే లక్ష్యంనామినేటెడ్ పదవుల మొత్తాన్ని సెప్టెంబరులోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినా, ఇప్పటి వరకుఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదనే అసంతృప్తి నాయకులు, కార్యకర్తల్లో ఉందని అధినాయకులు భావిస్తున్నారనిపార్టీ నేతలు అంటున్నారు. కాబట్టి వీలైనంత త్వరగా భర్తీ చేయాలనిచూస్తున్నారు. తొలిదశ జాబితా వారంలోపు వచ్చే అవకాశం ఉంటుందని నేతలు చెబుతున్నారు. రాష్ట్ర స్థాయిలో సుమారు 103 కార్పొరేషన్లు ఉన్నాయి. ఒక్కొక్క దానిలో ఛైర్మన్తోపాటు 11 మందికి డైరెక్టర్లుగా నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. తద్వారా 1,130 మంది వరకు నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. ఇవి కాకుండా మరో 300 పదవులు ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# యాక్టివ్ పాలిటిక్స్ లోకి భారతి...



కడప, ఆగస్టు 17 ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ టెన్షన్ తప్పిపోవడంతో రిలాక్స్ అయిన జగన్ మళ్లీ నవ్వుముఖంతో కనిపిస్తూ.. కూటమి ప్రభుత్వంపై సెటైర్లు మొదలుపెట్టారు. తాము చేసిన మేలు ఇంకా జనాల్లో ఉందంటూ మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఎండగడుతుంది కాని జగన్‌ని పెద్దగా ఎవరూ టార్గెట్ చేయడం లేదు. అసలు వైసీపీని ప్రతిపక్షంగా కూడా గుర్తించడం లేదు. వైసీపీ నేతలతో పాటు జగన్ దానిపై ఎక్కడ బెంగపెట్టుకుంటారో అన్నట్లు పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల ఆ లోటు తీరుస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ ఏ ధీమాతో చెప్తున్నారో కాని షర్మిల మాత్రం వైసీపీకి అంత సీన్ లేదని తేల్చేస్తున్నారుషర్మిల కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలుగా వైసీపీని, జగన్‌ని చీల్చి చెండాతున్నారు. గత ఎన్నికల్లో వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి వైసీపీకి ఎంత నష్టం చేయాలో అంతా చేశారు. ఓటమి తర్వాత కూడా వైసీపీని విడిచిపెట్టడం లేదు. సోదరుడు జగన్‌ని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పటికీ వైసీపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అధికారపక్షంగా కూటమి ఉన్నా విపక్షమైన వైసీపీని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు. అయితే వైసీపీలో ఆమెను సమర్థంగా ఎదుర్కోవడం ఎవరి తరం కావడం లేదు. గతంలో సజ్జల రామకృష్ణారెడ్డి కౌంటర్ ఇచ్చేవారు. ఓటమి తరువాత ఆయన సైలెంట్ అయ్యారు.ఇప్పుడు పేర్ని నాని సీన్‌లోకి వస్తున్నా.. షర్మిల దూకుడు ముందు ఆయన తేలిపోతున్నారు. దీంతో జగన్ పునరాలోచనలో పడ్డారంట. షర్మిలను కట్టడి చేయకపోతే మొదటికే మోసం వస్తుందని.. వైసీపీని బలోపేతం చేయడం కష్టమని భావిస్తున్నారంట. అందుకే ప్రత్యామ్నాయంగా షర్మిలను ఢీ కొనడానికి తన సతీమణి భారతీ అయితే సరిపోతారని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి కోడలిగా, జగన్ భార్యగా ఆమె ప్రజాక్షేత్రంలో అడుగుపెడితే.. ప్రజలు ఆహ్వానిస్తారని జగన్ భావిస్తున్నారంట.జగన్ ఇండియా కూటమి వైపు చూస్తున్నారన్న ప్రచారం విస్తృతంగా జరుగుతున్న తరుణంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగన్ సారథ్యంలోని వైసీపీ ఓ పిల్ల కాలువ అని, అది ఎప్పటికైనా మహాసముద్రమైన కాంగ్రెస్‌లో కలవాల్సిందేనని ఆమె వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిలో వైసీపీ చేరుతుందన్న ప్రచారాన్ని ఖండించిన షర్మిల.. వైసీపీ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని పరోక్షంగా వ్యాఖ్యానించడం ఆసక్తి రేపుతోంది.. గతంలోనే షర్మిల ఈ కామెంట్స్ చేసినా.. తాజాగా మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావించడం వెనక ఏమైనా మతలబు ఉందా..? అని రాజకీయ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.ఇండియా కూటమిలో వైసీపీ చేరుతుందనే ప్రచారాన్ని మాత్రమే ఖండించకుండా.. విలీనం అవుతుందనే తరహాలో షర్మిల చేసిన వ్యాఖ్యలు ఏపీ రాజకీయ వర్గాల్లో బిగ్ డిబేట్‌గా మారాయి. ఇప్పటికే ఏపీలోనూ బలపడాలని, అందుకోసం ఏమేం చేయాలన్న దానిపై కాంగ్రెస్ కసరత్తు చేస్తున్న టైంలో షర్మిల వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఆ క్రమంలో జగన్ టార్గెట్‌గా దూకుడు పెంచుతున్న షర్మిలను ఎదుర్కొనే విషయంలో వైసీపీ నానా తంటాలు పడుతోంది. ఒకరిద్దరు నేతలు షర్మిలకు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా.. షర్మిలదే పైచేయిగా నిలుస్తోంది. దీంతో షర్మిలను ఎదుర్కొనే విషయంలో వైసీపీ తీవ్ర కసరత్తు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. షర్మిల విమర్శలపై స్వయంగా జగన్ నోరు మెదపలేని స్థితిలో ఉన్నారు.షర్మిల విషయంలో ఇంకా మెతక వైఖరి అవలభిస్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందని జగన్ భావిస్తున్నారంట. గతంలో మంత్రులుగా పని చేసిన రోజా, విడదల రజిని, తానేటి వనిత, పుష్ప శ్రీవాణితోపాటు మహిళా కమిషన్ చైర్మన్‌గా పని చేసిన వాసిరెడ్డి పద్మ కూడా షర్మిల చేస్తోన్న విమర్శలపై మౌనంగానే ఉంటున్నారు. దీంతో షర్మిలకు కౌంటర్ ఇచ్చేందుకు భారతితో పొలిటికల్ ఎంట్రీ ఇప్పించాలని ఆలోచిస్తున్నారంట. మరోవైపు జగన్‌ను పాత కేసులు వెంటాడుతున్నాయి. అక్రమాస్తుల కేసుతోపాటు బాబాయ్ వివేకా హత్య కేసు కూడా ఆయనకు గండంగా మారింది. జగన్ కేసులపై రోజువారి విచారణ చేపట్టాలని కోర్టులు ఆదేశాలు ఇస్తున్నాయి.కేసుల ఉచ్చులో బిగుసుకుపోయిన జగన్ అరెస్టు అయితే పార్టీని నడిపించే నేత అవసరం. అందుకే భారతిని సిద్ధం చేయాలని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్‌ను గట్టిగానే ఎదుర్కొనేందుకు భారతి సరిపోతారని అలాగే తనకు ప్రత్యామ్నాయంగా పార్టీ పగ్గాలు చేపట్టడానికి భారతి అయితేనే కరెక్ట్ అని జగన్ భావిస్తున్నారంట.తల్లి విజయమ్మ జగన్ వైపు వచ్చే అవకాశం లేకపోవడంతో.. భారతిని తెరపైకి తేవడానికే ఫిక్స్ అయ్యారన్న టాక్ వినిపిస్తుంది. మరి చూడాలి ఏం జరుగుతుందో

# పిఠాపురంపై మెగా ప్లాన్

కాకినాడ, ఆగస్టు 17, మెగాస్టార్ చిరంజీవి వారసులుగా అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్, రామ్ చరణ్‌ల స్థాయి ఏంటో అందరికీ తెలిసిందే. తమ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ తో లక్షలాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ పుణ్యామాని ఇప్పుడు ఇక్కడ చూసిన పిఠాపురం పేరు మార్మోగిపోతుంది. ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలిచారు. రాష్ట్ర కేబినెట్లో డిప్యూటీ సీఎంగా కీలక భూమిక పోషిస్తున్నారు. ఎన్నికలకు ముందు పిఠాపురం నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి పవన్ కళ్యాణ్ నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అక్కడ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఇదిలా ఉంటే పవన్ ను భారీ మెజారిటీతో గెలిపించిన పిఠాపురం ప్రజలకోసం మెగా ఫ్యామిలీ ఒక మంచి నిర్ణయంతో ముందుకొచ్చినట్లు సమాచారం. ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, చేబ్రోలు మధ్య పదిన్నర ఎకరాల స్థలాన్ని రామ్ చరణ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థలంలో ఒక భారీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టడానికి రామ్ చరణ్- ఉపాసన ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ రవణం స్వామినాయుడు ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో వైద్య సేవల రంగంలో దేశంలోనే ప్రముఖ ఆస్పత్రిగా ఉన్న అపోలో పిఠాపురంలో ఏర్పాటు కానుంది.జనసేనాని పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా నియోజకవర్గంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తీసుకొస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రామ్ చరణ్ తో మాట్లాడి అపోలో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తానని.. ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పిఠాపురం నుంచి 70 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో పవన్ కళ్యాణ్ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన ఉప ముఖ్యమంత్రిగా కూడా ఉండటంతో తాను ప్రజలకు ఇచ్చిన హామీలపై పవన్ దృష్టి సారించారు. తన బాబాయ్ హామీని నెరవేర్చేందుకు పిఠాపురం నియోజకవర్గంలో పది ఎకరాల స్థలాన్ని కూడా రామ్ చరణ్, ఆయన సతీమణి, అపోలో లైఫ్ సంస్థల చైర్ పర్సన్ ఉపాసన కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నగరాల్లో అపోలో ఆస్పత్రులు సేవలను అందజేస్తున్నాయి. అంతేకాకుండా ప్రముఖ హాస్పిటల్ చైన్ గా కూడా అపోలో సంస్థలకు పేరుంది. ఇప్పుడు పవన్ కళ్యాణ్ పోటీ ద్వారా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన పిఠాపురంలోనూ అపోలో ఆస్పత్రి ఏర్పాటుకానుంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా పవన్ పార్టీ జనసేన తరఫున ప్రచారం చేసిన ఆయన అన్న నాగబాబు కుమారుడు, ప్రముఖ నటుడు వరుణ్ తేజ్, హీరో సాయి ధరమ్ తేజ్ సైతం పిఠాపురం తమ కుటుంబానికి ప్రత్యేక ప్రదేశంగా నిలుస్తుందన్నారు. తమ హృదయంలో పిఠాపురానికి ప్రత్యేక స్థానం ఉంటుందని ఆ సమయంలో చెప్పుకొచ్చారు. ఇదే స్థాయిలో పిఠాపురం నియోజకవర్గ ప్రజలు కూడా కులమతాలకతీతంగా పవర్ స్టార్ కు ఘనవిజయం అందించారు.ఇందులో భాగంగా అతి త్వరలోనే పిఠాపురంలో అపోలో ఆస్పత్రి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన పనులు కూడా మొదలు అయ్యాయి. అపోలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రే కాకుండా నియోజకవర్గానికి అవసరమైన ఇతర ప్రజోపయోగ పనులను చేపట్టడానికి సొంత నిధులను సైతం వెచ్చించడానికి మెగా కుటుంబం సిద్ధంగా ఉందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గం ఆయన ఆశించినట్టు దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మారబోతుందని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

# వైద్యులతో చర్చలు సఫలం.. ఏపీలో యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు




అమరావతి : ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల పెండింగ్ బకాయిల చెల్లింపునకు ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో వైద్యసేవలను యథావిధిగా కొనసాగించడానికి ప్రైవేట్ ఆసుపత్రుల సంఘం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. శనివారం ఏపీ వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆసుపత్రుల సంఘం నాయకులతో చర్చలు జరిగాయి. చర్చల్లో వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో పాల్గొన్నారు.సోమవారం రూ. 500 కోట్లు విడుదలకు మంత్రి అంగీకరించారని సంఘం నాయకులు విజయ్‌కుమార్ తెలిపారు. వచ్చే నెలాఖరుకు మరో రూ. 250 కోట్లు విడుదల చేయాలని మంత్రిని కోరామని ఆయన వివరించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులసమస్య శాశ్వత పరిష్కారానికి మంత్రి కృషి చేస్తామన్నారు.గత రెండేళ్లుగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ. 2,500 లు బకాయిలు పడ్డాయి. బకాయిలు చెల్లించకపోతే ఆగస్టు15 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించాయి. ఈ మేరకు రెండు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేశారు. దీంతో రోగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి శనివారం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది.

## టీడీపీ ఖాతాలోకి హిందూపురం

అనంతపురం, ఆగస్టు 17వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత తన బలాన్ని కోల్పోతూ వస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆ పార్టీ నేతలు ప్రత్యామ్నాయ పార్టీలవైపు తొంగి చూస్తూ ఉన్నారు. తమ రాజకీయ భవిష్యత్తు కాపాడుకునేందుకు వైఎస్ఆర్సిపి పార్టీలో ఉంటే కనుమరుగవుతామని మరో పార్టీలోకి వలసలు వెళ్తున్న పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చలాయించింది. రాష్ట్రంలో ఉన్న ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీ తప్ప దాదాపు అన్ని మున్సిపల్ కార్పొరేషన్ లను క్లీన్ స్వీట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని కోల్పోయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం ఉంటేనే ఎవరైనా పార్టీలో ఉంటారని ఆ పార్టీ నేతలు మరోసారి రుజువు చేసినట్లు అయింది. వైసీపీలో వారి క్యాడర్‌కు ఈక్వల్ గా తెలుగుదేశం పార్టీలో నాయకులతో చర్చించి అనంతరం తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంది. తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వం పురపాలక సంఘాన్ని కైవసం చేసుకుంది. గత ప్రభుత్వంలో సత్యసాయి జిల్లా ఇన్చార్జ్ మంత్రి గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కంచుకోట హిందూపురాన్ని వైసిపి వశం చేసుకోవాలని గతంలో అనేక వ్యూహాలు రచించారు. అందులో భాగంగా మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఓడించి చైర్మన్ పీఠాన్ని వైసిపి దక్కించుకుంది.హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉండగా ఆ ఎన్నికల్లో 30 మంది వైసీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. 6 మంది తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, ఒకరు బిజెపి, మరొకరు ఎంఐఎం పార్టీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం టిడిపి సంఖ్యాబలం 6 ఉండగా వైసిపి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు మరో ఎనిమిది మంది ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో పురపాలికలో తెలుగుదేశం సంఖ్యాబలం 18కి చేరింది. మరో ఇద్దరు తెలుగుదేశం పార్టీలోకి చేరితే మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ ఖాతాలో వేసుకొని ఉంది. ఇదే నెలలోనే అత్యవసర మున్సిపల్ సమావేశం నిర్వహించి చైర్మన్ పదవిని చేజిక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టింది. టీడీపీలో చేరిన తర్వాత మున్సిపల్ ఛైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ మున్సిపాలిటీ టీడీపీ కైవశం చేసుకునేందుకు పార్టీ వ్యక్తిని ఛైర్మన్ పదవిలో కూర్చోబెట్టేందుకు రంగం సిద్ధమైందని లోకల్‌గా టీడీపీ లీడర్లు చెబుతున్నారు. ఆమె స్థానంలో రమేష్‌ను నియమించనున్నారని తెలుస్తోంది.
మున్సిపాలిటీ మీద దృష్టి పెట్టిన తెలుగుదేశం:అధికారం కోల్పోయిన అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీలో ఆ పార్టీ సంఖ్యాబలం రోజురోజుకీ తగ్గుతూ వస్తుంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీలో ఇప్పటికే వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. నందమూరి ఖిల్లాగా ఉన్న హిందూపురం పురపాలక సంఘంలోనూ వైఎస్ఆర్సిపి చేతిలో ఉన్న పురపాలక సంఘం మరికొద్ది రోజుల్లోనే తెలుగుదేశం హస్తగతం చేసుకొనుంది ఇప్పటికే ఆ పార్టీ నుంచి చైర్మన్ ఇంద్రజతోపాటు మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు టిడిపిలోకి చేరడమే ఇందుకు కారణం. దీంతో రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో తన బలాన్ని వైఎస్ఆర్సిపి కోల్పోతూ వస్తుంది. ఇంకా ఎన్ని మున్సిపాలిటీల్లో ఈ విధంగా జరుగుతుందో అని రాష్ట్రవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.

### హాస్పిటల్లో విధులను బహిష్కరించిన ప్రభుత్వ వైద్య సిబ్బంది

ఆళ్లగడ్డ,కలకత్తా నగరంలో వారం రోజుల క్రితం మహిళా వైద్యురాలు పై జరిగిన సంఘటనకు నిరసనగా ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు శనివారం అన్ని వైద్య సేవలను నిలిపివేసి నిరసన తెలియజేయడం జరిగింది. డాక్టర్లపై జరుగుతున్న దాడులను సామూహికంగా ఖండించడం జరిగింది. హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో డాక్టర్లు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అనంతరం ర్యాలీ మానవహారం గా నిర్వహించడం జరిగింది. అనంతరం తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసిల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తిరుపాలయ్య, డాక్టర్ శబరిస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వంగాల దస్తగిరి రెడ్డి, మరియు వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## కర్నాటకలో రాజకీయ సంక్షోభం.. గవర్నర్ నిర్ణయంతో కేబినెట్ అత్యవసర భేటీ

మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కేటాయింపు వ్యవహారం కర్నాటక సీఎం సిద్ధరామయ్య మెడకు చుట్టుకుంటోంది. ఈ వ్యవహారంలో ఆయనను విచారించేందుకు కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేశారు.అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17, భారత నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 218కింద సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేశారు.తాజా పరిణామాలపై కాంగ్రెస్ భగ్గుమంది. కర్నాటక కాంగ్రెస్ సర్కారును కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంపై చర్చించేందుకు ఈ సాయంత్రం కర్నాటక కేబినెట్ అత్యవసర సమావేశమవుతోంది. ఈ వ్యవహారంలో ఏం చేయాలనేదానిపై సిద్ధరామయ్యతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఐఅ వేణుగోపాల్ మాట్లాడినట్టు తెలుస్తోంది. మరో వైపు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ కర్నాటక హైకోర్టును ఆశ్రయించే ఆలోచనలో సీఎం సిద్ధరామయ్య ఉన్నారు.మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కుంభకోణం వ్యవహారంలో ముగ్గురు వ్యక్తులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత వాటి విషయమై సంతృప్తి చెందిన గవర్నర్- సీఎంపై విచారణకు అనుమతి మంజూరు చేసినట్టు రాజ్‌భవన్ లేఖ విడుదల చేసింది. ముడాకు సంబంధించి 14 ఇళ్ల స్థలాలను సిద్ధరామయ్య భార్యకు కేటాయించారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ.



## ఆదర్శ పాఠశాల విద్యార్థుల పొలం బాట.

వ్యవసాయ మెళకువలు నేర్చుకోవడమే ధ్యేయం.




సంగెపు నాగేశ్వరరావు. వరి నాట్లు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల అగ్రికల్చర్ విద్యార్థినీలు శనివారం పొలం బాట పట్టారు. అగ్రికల్చర్ ఫీల్డ్ విజిట్ లో భాగంగా ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు అధ్యక్షతన, అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతి ప్రియా ఆధ్వర్యంలో విద్యార్థినీలు పొలానికి వెళ్లి వరినాట్లు వేసినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పుస్తకాలు కొన్ని నేర్పుతాయి. ఇప్పుడు క్షేత్రస్థాయి అధ్యయనమే జీవితాన్ని నేర్పుతుంది అని అందరూ కలిసి కదిలామన్నారు. తాము ఇన్నాళ్లూ అభ్యసించిన చదువు కార్యరూపం దాల్చేలా.. వ్యవసాయ క్షేత్రంలో పరిశోధనలు జ్యోతి ప్రియా ఆధ్వర్యంలో మొదలుపెట్టారు అని అన్నారు. అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతి ప్రియా మాట్లాడుతూ ఇది ఒక గొప్ప అనుభూతి కలిగే కార్యక్రమం అని అన్నారు. తల్లి తండ్రుల విలువ కూడా తెలుస్తుంది అని చెప్పారు. ఆహార క్షేత్రంలో మన రైతుల పడే శ్రమ, కష్టం ప్రత్యక్షంగా పిల్లలు, మేమంతా చూసామన్నారు. ఈ కార్యక్రమనీ లో వైస్ ప్రిన్సిపల్ సురేష్ కుమార్, కిరణ్ కుమార్, సుధాకర్ బాబు మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు వ్యవసాయ రంగంలో మెలకువలు తెలుసుకోవాలి. ఎస్ ఓ లక్ష్మీదేవి.

వరి నాట్లు వేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–చదువుతోపాటు విద్యార్థులు వ్యవసాయ రంగంలో కూడా మెలకువలు తెలుసుకోవాలని ఎస్ ఓ లక్ష్మీదేవి అన్నారు. ఈ సందర్భంగా శనివారం కేజీబీవీ ప్రిన్సిపల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్ర పర్యటనలో భాగంగా అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతి అధ్యక్షతన 50 మంది విద్యార్థులు చదువుతోపాటు వ్యవసాయ రంగంలో ఉపయోగపడే ప్రయోజనాల గురించి తెలుసుకుంటూ వరి నాట్లు వేశారు. ఈ వరి నాట్లు వేసే సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులు మాట్లాడుతూ రైతు పడే బాధలు,శ్రమ తెలుసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.







## రుద్రవరం ఎస్సైగా వరప్రసాద్.

పాత్రికేయులతో మాట్లాడుతున్న ఎస్సై.

నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–రుద్రవరం మండల నూతన ఎస్సైగా వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కోవెలకుంట్ల మండల ఎస్సై గా పనిచేశానని ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రుద్రవరం మండల నూతన ఎస్సైగా శనివారం బాధ్యతలు స్వీకరించానని ఆయన తెలిపారు. అలాగే మండల పరిధిలోని గ్రామాలలో శాంతి భద్రతలకు విఘా దాలు కలిగించే ఎటువంటివారినైనా ఉపేక్షించేది లేదని అటువంటి వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లు శోభన్ బాబు, బాలన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# పద్మ పీఠం వెండి గొడుగు విరాళం.

ఆలయ కమిటీ సభ్యులకు వెండి విరాళాన్ని అందచేస్తున్న దాతలు.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:– మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పద్మ పీఠం, వెండి గొడుగును దాతలు విరాళంగా అందజేశారు. శనివారంరుద్రవరంలో వెలిసిన శ్రీ కాశీ విశ్వేశ్వర ఆంజనేయస్వామి,శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆలయమునకు పద్మ పీఠం,వెండి గొడుగు ను ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం వీరా రాఘవరెడ్డి , ఆయనసతీమణి. సావిత్రమ్మ వారి చిన్న కూతురు మౌలేశ్వరమ్మ , ప్రభాకర్ రెడ్డి, వీరి కూతుళ్లు. జోష్న, యశస్విని ల చేతుల మీదుగ ఆలయ. కమిటీ సభ్యులు లింగం సత్యం, నూకల కృష్ణమూర్తి ,నల్లగట్ల వెంకటేశ్వర్లు ,భునగిరి కృష్ణమూర్తి,చిన్న పోలయ్య, బింగమల సురేష్, టంగుటూరి శ్రీనివాసులు లకు అందజేశారు.

## మేయర్ బీ.వై రామయ్య కమీషన్లు తీసుకోవడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యం..

పారిశుధ్య కార్మికుల నియామకమంతా పారదర్శకంగానే చేశాము.

.మంత్రి టి.జి భరత్ గురించి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే మేయర్ అవినీతి చిట్టా బయటపెడతాం..

విలేకరుల సమావేశంలో మండిపడిన తెదేపా కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు





కర్నూలు ఆగస్టు 17:కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీ.వై రామయ్య కమిషన్లు తీసుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మండిపడ్డారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు విలేకరులతో మాట్లాడారు. మురుగు కాలువలు శుభ్రం చేసే కార్మికుల నియామకం విషయంలో రాష్ట్ర మంత్రి టి.జి భరత్ పేరు ప్రస్తావించి మేయర్ ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడంపై కొర్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్‌ను ప్రజలే గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడిందని.. మున్సిపల్ ఆఫీసులో కూర్చొని సెటిల్మెంట్లు చేయడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. కర్నూలును స్మార్ట్ సిటీ చేసే విధానంలో భాగంగా.. మే నెలతో పారిశుధ్య వర్కర్ల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో వెంటనే కౌన్సిల్‌లో ఆమోదం పెట్టి కొత్త వారిని తీసుకోవడం జరిగిందన్నారు. కౌన్సిల్ ఆమోదం తెలిపిన అజెండాలో కొత్త వర్కర్లను తీసుకోవాలనే ఉందని కార్పొరేటర్లు తమ వద్ద ఉన్న పత్రాలు చూపించారు. గతంలో మేయర్ తీసుకున్న 180 మంది వర్కర్లను ఔట్‌సోర్సింగ్ కింద చేస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకొని పనిలోకి తీసుకున్నారని మండిపడ్డారు. ఇన్ని రోజులు అధికారంలో ఉండి కూడా ఈ వర్కర్లను ఎందుకు ఔట్‌సోర్సింగ్ కింద చేయలేదని ప్రశ్నించారు. పేద ప్రజల వద్ద డబ్బులు తీసుకొని ఔట్‌సోర్సింగ్ కిందకు తీసుకోకుండా వాళు రోడ్డున పడే స్థితికి తీసుకొచ్చారని మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నియమించిన వర్కర్లలో ఎవ్వరి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని కార్పొరేటర్లు తెలిపారు. నగరంలో కొత్తగా చేపట్టిన పనులకే మంత్రి టి.జి భరత్, కార్పొరేటర్లం కలిసి శంకుస్థాపనలు చేస్తున్నాం తప్ప పాత వాటికి కాదన్నారు. గతంలో జొహరాపురం బ్రిడ్జి నిర్మాణం మొత్తం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తయితే మొత్తం పని మీరే చేసినట్లు గొప్పలు చెప్పుకున్నారన్నారు. ఇక ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత మేయర్ రామయ్యకు లేదన్నారు. గతంలో జరిగిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తెలుగుదేశం పార్టీ తరుపున ఎన్నికైన కార్పొరేటర్లను పిలవకుండానే పనులు జరిపించారన్నారు. అప్పట్లో రోడ్లపైకి వచ్చి తాము నిరసన చేపట్టిన విషయాన్ని కార్పొరేటర్లు గుర్తు చేశారు. తమ వార్డుల్లో ఉన్న సమస్యల గురించి కౌన్సిల్‌లో మాట్లాడేందుకు కూడా మేయర్ తమకు అవకాశం ఇవ్వలేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

మేయర్ రామయ్య తీరు కౌన్సిల్ మీటింగ్‌లో విచిత్రంగా ఉంటుందన్నారు. వైసీపీ కార్పొరేటర్లను గౌరవించి టిడిపి కార్పొరేటర్లను పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్పారు. టిడిపి కార్పొరేటర్లు ఉన్న వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇలాంటి పరిస్థితి ఉండకూడదనే మంత్రి టి.జి భరత్ ఆదేశాలతో కొత్త వర్కర్లను తీసుకున్నామన్నారు.కరోనా సమయంలో పనిచేసిన వారిని తీసివేసి కొత్తవారికి ఎందుకు తీసుకున్నారని నాయకులు ప్రశ్నించారు. ఇప్పుడున్న పారిశుధ్య కార్మికుల్లో కేవలం 90 మంది గురించి మాత్రమే ఇప్పుడు లేవనెత్తారని.. ఎందుకంటే డబ్బులిచ్చి పనిలో చేరిన వారిలో కొంతమంది వీళ్లను ప్రశ్నించలేదని.. మిగిలిన వారు ప్రశ్నించడంతో చేసేదేమీ లేక ఇప్పుడు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇక డిప్యూటీ కమిషనర్ నియామకం గురించి మేయర్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇన్నాళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్‌ను ఎందుకు నియమించలేదన్నారు. వైసీపీ 5 ఏళ్లు అధికారంలో ఉండి చేసిందేమీ లేదన్నారు. టి.జి భరత్ గెలిచి మంత్రి అయిన వెంటనే జీర్ణించుకోలేక ఆయనపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మంత్రి టి.జి కుటుంబం గురించి ఇష్టానుసారంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే మేయర్ అవినీతి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్, జకియా అక్సారీ, లతీఫ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు రామాంజనేయులు, గున్నామార్క్, సుంకన్న, ఖాదర్ బాషా, అకీమ్, మోయిన్ బాషా, శేషు యాదవ్, సీనియర్ నాయకులు శేషగిరి శెట్టి, పాల్ రాజ్, ఏసు, తారనాథ్, బాలు, ఇబ్రహీం, చెన్న, విక్రమ్ సింగ్, చిన్నమ్మి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి జూటూరు రవి, లక్ష్మి, మనీష్, సురేంద్ర, శ్రీకాంత్, రామకృష్ణ, హరి, ఊట్ల రమేష్, రామయ్య యాదవ్, క్రిష్ణ, బాలయ్య, నరసింహులు, తదితర ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మండల ఏవో, పిఎస్

సంజామల / శ్రీ ప్రస్థానం న్యూస్; సంజామల మండల పరిధిలోని మంగ పల్లె శ్రీ పెద్దారెడ్డి తిమ్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో శనివారం జరిగిన అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేంద్ర సోదరుడు శ్రీనివాసులు వివాహ వేడుకలలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధులను ఏవో, పంచాయతీ కార్యదర్శి ఆశీర్వదించారు. వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శి ఉద్యోగులు అగ్రికల్చర్ , హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## దొర్నిపాడు డిప్యూటీ తహసీల్దార్, గా ఆర్. మాధవ్, భాద్యతలు స్వీకరణ

.దొర్ని పాడు,ఆగస్టు:17, శ్రీ ప్రస్థానం న్యూస్:– స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం లో నూతన డిప్యూటీ తహసీల్దార్ గా ఆర్.మాధవ్, శనివారము భాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం లో డిప్యూటీ తహసీల్దార్ గా పనిచేస్తూ సాధారణ బదిలీ లో భాగంగా దొర్నిపాడు మండల నూతన డిప్యూటి తహశీల్దార్,గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించే వెంకట రవి,నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ పై వెళ్ళారు.



## ఆళ్లగడ్డలో వైద్య సేవలు బహిష్కరించిన వైద్యులు.




ఆళ్లగడ్డ, ఆగస్టు:17, శ్రీ ప్రస్థానం న్యూస్:– కలకత్తా నగరంలో మహిళా వైద్యు రాలు పై జరిగిన సంఘటనకు నిరసనగా శనివారము ఆళ్లగడ్డ పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అన్ని వైద్య సేవలు నిలిపివేస్తూ నిరసన తెలిపారు. డాక్టర్ల పై జరుగుతున్నా సామూహిక దాడులను ఖండించారు. ఆసుపత్రి సూపింటెం డెంట్ డాక్టర్ సుజాత అధ్వర్యంలో డాక్టర్లు వైద్య సిబ్బంది,నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుండి ర్యాలీ నిర్వహించి పట్టణంలోనీ నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తిరుపాలయ్య, డాక్టర్ శబరీష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వంగాల దస్తగిరి రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

## వైద్యురాలిని హత్య చేసిన వారిని వెంటనే శిక్షించాలి.

వైద్యాధికారిని గాయత్రి.ర్యాలీగా నిరసన తెలుపుతున్న వైద్యాధికారిని, సిబ్బంది.




నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–కలకత్తాలో మహిళా వైద్యురాలినిపై అత్యాచారం చేసి ఆమెను చంపిన వారిని వెంటనే శిక్షించాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని గాయత్రి అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని గాయత్రి, సిబ్బంది కలిసి ర్యాలీగా గ్రామంలోని పలు వీధుల వెంబడి తిరుగుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలకత్తాలో మహిళ వైద్యురాలిని పై అత్యాచారం చేసిన వారిని ప్రభుత్వం వెంటనే కఠినంగా శిక్షించి. ముందు ముందుగా మహిళలపై ఇలాంటి అత్యాచారాలు జరగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విశేష పూజలు అందుకుంటున్న వాసాపురం వెంకటేశ్వర స్వామి

. పూజలు నిర్వహిస్తున్న భక్తులు.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మండల పరిధిలోని రుద్రవరం అప్పనపల్లి ప్రధాన రహదారిలో వెలసినటువంటి శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి శ్రావణమాసంలో రెండవ శనివారం సందర్భంగా విశేష పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి, మానన సరోవర లింగేశ్వర స్వాములను శ్రావణమాసంలో రెండవ శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో దర్శించుకొనుటకు వచ్చిన భక్తాదులందరికి ఆలయ ప్రధాన అర్చకులు గోపి శర్మ, శివయ్య లు గోత్ర నామార్చనలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనార్థం వచ్చిన భక్తాదులందరికి ఆలయ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757